**మోహన్ చెప్పిన ఆ మాట విన్నాక సుబ్బారావుకి గుండె బరువెంతో తగ్గిపోయినట్లు, ఆలోచనలన్నీ ఆవిరై పోయినట్లు, మనసు మేఘాల్లో తేలిపోతున్నట్లు అన్పించింది.. ఇన్నాళ్ళూ ఆ విషయం గురించి ఎంత ఆందోళన చెందాడు?**


సుబ్బారావు భార్యపేరు సుశీల....మోహన్, ఆనందరావు ఇద్దరూ సుబ్బారావు స్నేహితులు.. పెళ్ళికాని ఆ ఇద్దరూ సుబ్బారావు ఇంటికి తరచూ వస్తూపోతూ ఉంటారు....సుశీలతో కూడా వాళ్ళిద్దరూ మాట్లాడుతుంటారు....

అయితే సుబ్బారావుకి అమధ్య ఓ అనుమానం కలిగింది....

అదేమిటంటే....సుశీల ఆ ఇద్దరితోనూ క్లోజ్‌గానే 'మువ్' అవుతున్నా, వాళ్ళిద్దరూ సుశీలతో చాలా బాగా మాట్లాడుతున్నా.... సుశీలంటే ఆనందరావుకి, ఆనందరావంటే సుశీలకు ప్రత్యేకమైన 'ఇది' ఏదో ఉందేమో అన్పించి, అది క్రమంగా అనుమానంగా మారింది....

ఆ అనుమానం సుబ్బారావుకి ఊరకనే కలగలేదు, దానికి కొన్ని బేసిక్ పాయింట్సు ఉన్నాయి మరి!

అవేమిటంటే..., సుశీలను ఆనందరావు, ఆనందరావుని సుశీల చూసే విధానంలో ఓ ప్రత్యేకత ఉంది....వాళ్ళ కంటిరెప్పల కదలికల్లోంచి శబ్దంలేని భాష ఏదో భావాన్ని వాళ్ళకు అందిస్తున్నట్టుగా ఉంటుంది. సుశీల మోహన్‌తో ఆనందరావుతో ఎక్కువగా మాట్లాడ్డం, ఆనందరావు ప్రతీ విషయాన్ని సుశీలతోనే చెప్పడం.'. తను లేనప్పుడు మోహన్ కంటే ఆనందరావే ఎక్కువ రావడం, తను లేనప్పుడు మోహన్ వచ్చిన ప్రతీసారీ మోహన్ వచ్చాడని చెప్తే



సుశీల ఆనందరావెప్పుడు వచ్చినా తనతో చెప్పకపోవడం, చెప్పడంమరచిపోయాననడం.. ఇలాంటివెన్నో అతని అనుమానానికి ఊపిరిని, ప్రాణాన్ని పోసి బ్రతికించాయి...

ఆ అనుమానాన్ని ఇటు కక్కలేక, అటు మింగలేక....అసలిలా టప్పుడు ఏం చేయాలో తెలియక, ఎవర్ని ఏమనాలో అర్థంకాక.... తనలో తనే సతమతమవుతున్నాకిన్నాళ్ళూ సుబ్బారావు....

ఆకలేసి అన్నం ముందు కూర్చున్నాక తిన బుద్ధేయక, నిద్దరొచ్చి మంచం మీద పడుకున్నాక నిద్రపట్టక, ఏదైనా పత్రిక చదువుదామని తీసాక చదివింది అర్థంకాక నరక యాతన పడ్డాడు....క్రమంగా అది ఓ పెద్ద బాధగా, బెంగగా మారిపోయింది పాపం సుబ్బారావుకి !

ఆ బాధ, బెంగ మోహన్ చెప్పిన మాటల్తో తగ్గిపోయి కాస్త మనిషయ్యాడు సుబ్బారావు....

రెండు రోజులు గడిచాక ఆ రోజు రాత్రి సుశీల అన్న మాటలు సుబ్బారావు గుండెలో నిండిపోయి ఇంకా కొద్దిగా మిగిలిపోయిన ఆ బాధను, బెంగను పూర్తిగా తుడిచేసి సుబ్బారావుని పూర్తిగా మనిషిని చేసాయి....

ఇంతకీ మోహన్, సుశీల ఇద్దరూ వికివికిగా సుబ్బారావుతో అన్న మాటలు ఏమిటంటే....

"సుబ్బారావ్, ఈ మధ్య రెండు మూడుసార్లు ఆనందరావు సుశీల గురించి చాలా ఇదిగా మాట్లాడాడు....నవ్వితే మీ ఆవిడ ముఖం చూడలేమట, నవ్వపోతే అసలక్కడ ఉండలేమట.... అసలు సుబ్బారావుగాడు అలాంటి దాన్ని చేసుకున్నాడేమిట్రా, అంతకంటే ఈ భూ ప్రపంచం మీద ఇంకెవ్వరూ దొరకలేదేమిట్రా వాడికీ? ఏదో వాడు ఫ్రెండని వాడింటికి వెళ్ళడం, ఫ్రెండు పెళ్ళామని ఆవిడతో మాట్లాడ్డం గానీ ఆవిడంటే నాకు భలే దోకురా అని అన్నాడు" అని చెప్పాడు మోహన్...

"ఏవండీ, ఇలా అంటున్నానని ఏమీ అనుకోకండేం! మీ ఫ్రెండు మోహన్ లేడూ అతను జెంటిల్‌మేన్‌లాగ ఉంటాడు, ఆ ఆనందరావే అదోరకంగా రౌడీలాగ ఉంటాడు....ఆ డ్రెస్సులేమిటండీ అలాంటివేస్తాడు? పైగా పెద్దపోజు.... అదీ కాక మాటలు కూడా చిరాగ్గా ఉంటాయి.... మీరేమైనా అనుకుంటారని అతనితో ఆ మాత్రం మాటాడ్డం గానీ నిజానికి అతనంటే నాకు చాలా చిరాకు....అందుకే అతనొచ్చినా మీతో చెప్పడం మరచిపోతుంటాను .... వేసే జోకులన్నీ కుళ్ళు జోకులే. బాగుండదని వినడం, నవ్వడమూను!" అని అంది సుశీల....

వాళ్ళిద్దరి ఆ మాటల్తో సుబ్బారావు కొండంత ధైర్యాన్ని గుండెల్లో నింపుకొని ధీమాగా ఊపిరి పీల్చుకుంటూ కాలాన్ని హేపీగా గడిపేస్తున్నాడు....

* * * *

ఒక రోజు రాత్రి....

సుబ్బారావు ఊరి నుండి వచ్చి బజర్ మీద వేలు పెట్టబోతుండగా లోపల్నుంచి చిన్నగా వినబడుతున్న మాటలు అతన్ని ఆకర్షించడంతో వేలు తీసేసి, చెవులు రిక్కించి వాటిని వినడం మొదలుపెట్టాడు....

"కానీ భలే అయిడియా వచ్చిందండి మీకు!"

"నిజమే నేనూ సుశీ ముందు నాకెందుకో సుబ్బారావు ముఖం చూస్తుంటే కాస్త అనుమానం వచ్చింది.... ఆ తర్వాత నీకు కూడా అనుమానం కలుగుతుందని చెప్పేవు.... బాగా ఆలోచించగా ఆలోచించగా ఆ అయిడియా వచ్చింది....ఇంప్లిమెంట్ చేసేసాం, సక్సెస్ అయ్యాం."

"మనం అనుమానించినట్టు అతనికి మన మీద అనుమానం లేకపోతే సరేసరి.... ఉంటే మీరు ఆ మోహన్‌తో అన్న మాటల్తో, నేను అతనితో అన్న మాటల్తో ఆ అనుమానం కాస్తా పటాపంచలైపోతుంది... దాంతో మనకు మరిన్ని అవకాశాలు వస్తాయి. ఎటువంటి బెరుకుదనం లేకుండా మరింత ఫ్రీగా ఉంటుంది.... అవును గానీ, మోహన్ అతనితో మీరన్నవి చెప్తాడంటారా?"

"వాట్ సుశీ డార్లింగ్, నన్నంత అండర్ ఎస్టిమేట్ చేయకు.... మోహన సంగతి నాకు బాగా తెలుసు, వాడికి అక్కడివి ఇక్కడివి అక్కడకు మోసే అలవాటుంది....అందులోనూ ఇలాంటివంటే మరీనూ. పైగా వాడికి సుబ్బారావంటే చాలా ఇష్టం సుబ్బారావుకి వాడే క్లోజ్ ఫ్రెండు అయిపోదామని అదో యూజ్‌లెస్ తాపత్రయం వాడికి....ఇన్ ఎడిషన్ టూ దిస్ నాకూ వాడికీ పెద్దగా పొత్తుకుదరదు కూడా."

"మోహన్ చెప్పే వుంటాడు లెండి, ఆయనలో కూడా ఈ మధ్య మార్పు కనిపించింది నాకు...."

సుబ్బారావుకి విషయం అర్థమయింది.... మనిషి నిలువెల్లా కంపించిపోయాడు... పక్కనున్న కిటికీలోంచి చూద్దామని ప్రయత్నం చేశాడు గానీ కిటికీ తలుపులు వేసేసి వున్నాయి.

"ఆయన ఈ రోజు కోణార్క్‌కి వస్తానన్నారు ఊరికి వెళ్ళేటప్పుడు....పన్నెండయి పోయిందే, త్వరగా కానియ్యండి, మరో రెండు గంటల్లో ఆయన వస్తారు....ఈ రెండ్రోజులూ ఎలాగూ కుదిరింది కదా, ఈ రోజు పడ దే వినలేదు, కాస్త ముందు కలుసుకుందామంటే వీధిలో వాళ్ళు తలుపులు పెండలాడే వెయ్యరు....ఈ రోజు మాత్రం సరిగ్గా ఒంటిగంటకు మీరు బయల్దేరిపోవాలి, లేకపోతే దొరికిపోతాం."

"అలాగేలే గానీ ఇంకా ఫుల్ డ్రస్సులోనే వుంటే ఒంటిగంటకు ఎలా వెళ్ళగలను చెప్పు?"

"అయితే లైటార్పండి...."

కోణార్క్ కోసం ముందుగానే ఫోన్ చేసి కనుక్కుంటే అది ఆరుగంటలు లేటని, మరో అరగంటలో మూడు గంటలు లేటుగా ఈస్ట్‌కోస్ట్ వస్తుందని చెప్పడంతో దాన్ని కాచ్ చేసి ముందుగా రాగలిగిన సుబ్బారావు అక్కడ్నుంచి భారంగా అడుగులు వేసుకుంటూ వీధి చివరకు వెళ్ళి నిల్చున్నాడు....

ఆ ఆవేశంలో ఒక్కసారిగా బజర్ నొక్కారని, వాళ్ళని బయట పెట్టాలని అన్పించినా, అతి కష్టంమీద తనను తాను కంట్రోల్ చేసుకోగలిగాడు....

ఇప్పుడు 'ఏం చేయాలా?' అని ఆలోచించడం మొదలు పెట్టాడు....

అలా ఆలోచిస్తుంటే రెండు సందర్భాలలో సుశీల అన్న మాటలు గుర్తొచ్చాయి సుబ్బారావుకి.

"ఆడది సంతానమే కాదు, సంతృప్తిని కూడా కోరుకుంటుంది....పిల్లల్ని కన్న ప్రతి వాళ్ళూ ఆ విషయంలో సంతృప్తి పడ్డారని కాదు, తండ్రి అయిన ప్రతివాడూ భార్యని సంతృప్తి పరచాడనీ కాదు....అని వుంది ఈ పుస్తకంలో! ఎవరోగానీ చాలా కరెక్టుగా వ్రాశారు కదండీ?"

"అప్పుడే పిల్లలొద్దంటే....అందుకే ఈ పిల్స్ వాడుతున్నాను....మీరోసారి డాక్టరు దగ్గరకు వెళ్ళగూడదూ?"

అవి గుర్తొచ్చాక ఏదో అర్థమై, ఏం చేయాలో బోధపడి అడుగులు ముందుకు వేశాడు సుబ్బారావు ఓ రెండు గంటలు సినిమా హాలు దగ్గరైనా, ఇంకెక్కడైనా కాలం గడపటానికి! *



# సంతృప్తి

కొమ్మకొండ సత్యానంద్